లోగిళ్లు... ఆనంద పరవళ్లు

- భీమిలి మండలంలో 2,163 మంది పేదలకు జగనన్న కాలనీ ఇళ్లు
- స్థలాల విలువ రూ.321 కోట్లకు పైనే...
- ఇప్పటికే చాలా ఇళ్ల నిర్మాణాలు పూర్తి




చిప్పాడలో పూర్తయిన ఇల్లు


చిప్పాడ కాలనీ మధ్యలో రహదారి నిర్మాణానికి కేటాయించిన స్థలం


సిటీనగర్‌లో నిర్మితమైన జగనన్న కాలనీ


చిప్పాడలో పెదనాగమయ్యపాలెం, మూలకుద్దు వాసుల కాలనీ


కొత్త మూలకుద్దులో నిర్మాణంలో ఉన్న కాలనీకి విద్యుత్ లైన్

తగరపువలస : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో కీలకమైన పేదలకు సొంతింటి కల సాకారమవుతోంది. ఇందుకోసం భారీగా ప్రభుత్వ స్థలాలు సేకరించడంతోపాటు అవసరమైన చోట ప్రైవేట్ భూములు కొనుగోలు చేశారు. పేదలకు కేవలం ఇళ్లే కాకుండా వారికి అవసరమైన విద్యుత్ సరఫరా, రోడ్లు, తాగునీరు, డ్రైనేజీలు, పార్కులు వంటి అదనపు వసతులు కల్పించడం ద్వారా కాలనీలుగా మారుతున్నాయి. భవిష్యత్‌లో ఈ కాలనీలు గ్రామాలుగా మారితే పాఠశాలలు, ఆస్పత్రులు, వ్యాయామశాలలు, సచివాలయాలు, పోలీస్ స్టేషన్లు నిర్మించనున్నారు. దీంతో అక్కడి ప్రజలు వాటిని జగనన్న కాలనీలుగా పిలుచుకుంటున్నారు. భీమిలి మండలంలో 16 పంచాయతీలతోపాటు జీవీఎంసీలో విలీనమైన ఐదు గ్రామ పంచాయతీల్లో మొదటి విడతగా 2,163 మంది లబ్ధిదారులకు 72 గజాల వంతున స్థలాలను కేటాయించారు. భీమిలి మండలంలోనే కాకుండా స్థలాల లభ్యత ఆధారంగా పక్క మండలాల్లోనూ కేటాయించారు. వివిధ పంచాయతీల్లో కేటాయించిన స్థలాల గజం విలువ రూ.10వేల నుంచి రూ.25వేల వరకూ ఉన్నాయి. ప్రస్తుతం భీమిలి మండలంలోని లబ్ధిదారులకు వసతుల కల్పన కాకుండా కేటాయించిన స్థలాల విలువ రూ.321 కోట్లకు పైగా ఉంటుంది.


చిప్పాడ కొండవాలు ప్రాంతంలో నిర్మాణ దశలో జగనన్న కాలనీ

టీడీపీ హయాంలో ఒక్క ఇల్లూ ఇవ్వలేదు..

గత టీడీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఎక్కడా పేదవారికి ఒక్క ఇల్లైనా ఇచ్చిన పాపాన పోలేదు. అంతకు ముందు ఎన్టీఆర్ హయాంలో ఇచ్చిన ఇళ్ల ప్రస్తుతం శిథిల దశకు చేరుకుని మరమ్మతుల కోసం ఎదురుచూస్తున్నాయి. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సొంతంగా ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షల వంతున సాయం చేస్తోంది. అంతేకాకుండా డ్వాక్రా మహిళలకు అదనంగా రూ.30వేల వరకు బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పిస్తోంది. పెద్ద కుటుంబాలు కలిగిన వారు సమిష్టిగా ఇళ్లు నిర్మించుకుని వారి అభిరుచి మేరకు వసతులు కల్పించుకుంటున్నారు. భీమిలి మండలంలో చాలా పంచాయతీల్లో ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. చాలా చోట్ల గృహ ప్రవేశాలు కూడా జరిగిపోయాయి. మరికొన్ని చోట్ల చిన్నపాటి సాంకేతిక లోపాల కారణంగా నిర్మాణం ప్రారంభ దశలో ఉన్నాయి.


చిప్పాడ కాలనీకి విద్యుత్ లైన్

సొంతిల్లు కట్టుకోగలిగాం



నా భర్త గౌరీ అప్పన్న తాపీ పనులు చేస్తుంటారు. మాకు 4, 6 ఏళ్ల కలిగిన ఇద్దరు మగపిల్లలు. వీరిని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నాం. మాకు సొంతిల్లు లేని లోటును జగనన్న తీర్చారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలం, రుణ సాయంతోపాటు మా కష్టార్జితం కొంత కలిపి ఇల్లు కట్టుకోగలిగాం. సీఎం జగన్‌కు రుణపడి వుంటాం.

– కందివలస రామయ్యమ్మ, చిప్పాడ

జగన్ బాబు మేలు మరువలేం



మా కోడలు నూకరత్నం పేరుతో సీఎం వైఎస్ జగన్ ఇంటి స్థలం మంజూరు చేశారు. నా కుమారుడు కూలి పనులు చేస్తుంటాడు. నా పర్యవేక్షణలో ఇటీవల ఇంటి నిర్మాణం చేపట్టాం. శ్లాబు వరకు నిర్మించుకున్నాం. త్వరలో ఇల్లు పూర్తి చేసి గృహ ప్రవేశం చేస్తాం. అద్దె భారం తగ్గుతుంది. జగన్ బాబు చేసిన మేలు జీవితాంతం మరువలేం.

– సరగడ అప్పలనరసయ్య, చిప్పాడ

సీఎం జగన్‌కు రుణపడి వుంటాం



మాది ఒడిశాలోని మల్కన్‌గిరి. భర్త టైలరింగ్ చేస్తుంటాడు. ఇద్దరు కుమార్తెలు. చాలా ఏళ్ల క్రితమే పొట్ట చేతపట్టుకుని భీమిలి వచ్చాం. పిల్లల పెళ్లిళ్లు అద్దె ఇంట్లోనే చేశాము. మాకు ఉన్న అర్హత ఆధారంగా ఇంటి స్థలంతోపాటు నిర్మాణానికి రుణం మంజూరు చేశారు. ఇల్లు పూర్తి చేసుకుని ఇటీవల దిగిపోయాం. సీఎం జగన్‌కు రుణపడి వుంటాం.

– కోనేటి సత్యవతి, చిప్పాడ

క్లుప్తంగా

జెడ్సీ రాముకు ఘన సత్కారం


రాము దంపతులను సత్కరిస్తున్న జెడ్సీ శైలజవల్లి, సిబ్బంది

భీమునిపట్నం: స్థానిక జోనల్ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం బదిలీ అయిన జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రామును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రస్తుత జెడ్సీ శైలజవల్లి, సిబ్బంది, తదితరులు రాము దంపతులను సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఆయన ఇక్కడ ఎంతో చక్కగా పనిచేసి అందరి మన్ననలు పొందారన్నారు. అనంతరం రాము మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని ప్రజలు, సిబ్బంది తనకు ఎంతో సహకారం అందించారని, వారందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా అన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీయూ పద్మనాభం కార్యవర్గం


ఎస్టీయూ కార్యవర్గ సభ్యులు

పద్మనాభం: పద్మనాభం మండల ఎస్టీయూ అధ్యక్షుడిగా వాడపల్లి గణేష్, గౌరవ అధ్యక్షునిగా కె.అక్కులు, ప్రధాన కార్యదర్శిగా తాలాడ రామకృష్ణ ఎన్నికయ్యారు. సహాధ్యక్షులుగా ఎం.ప్రశాంతి, అదనపు ప్రధాన కార్యదర్శిగా పి.రామునాయుడు, ఉపాధ్యక్షులుగా కె.ప్రసాద్, పి.శ్రీనివాసరావు, కార్యదర్శులుగా ఐ.వెంకటరాజు, కె.ఆదిబాబు, ఎస్.నాగరాజు, కోశాధికారిగా ఎ.బంగారురావు, జిల్లా కౌన్సిలర్లుగా ఆర్.జగదీష్‌బాబు, వి.శంకరరావు, ఎస్.రమేష్, జి.సింహాచలం, టి.రామస్వామి, కె.టి.ఎస్.నాయుడు, వి.ఆంజనేయులు, పి.లక్ష్మణరావు నియమితులయ్యారు. పద్మనాభం జిల్లా పరిషత్ బంగ్లా ప్రాంగణంలో ఈ ఎన్నిక బుధవారం నిర్వహించారు.

విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో శివరాణి

తగరపువలస : ఇటీవల భీమిలిలో జరిగిన 9వ అంతర జిల్లాల రగ్బీ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను ఎంఈవో శివరాణి అభినందించారు. 8, 9 తరగతులు చదువుతున్న వీరిలో సునీత, శ్రావ్య, హేమంత్, సురేష్ ఉన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గాడు పైడిరాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు లలిత్‌కుమార్‌ను కూడా అభినందించారు.

విద్యా రంగానికి పెద్దపీట


విద్యార్థినులకు సామగ్రి అందిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యా రంగానికి పెద్ద పీట వేశారని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. పద్మనాభంలోని కస్తూర్బా విద్యాలయంలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు బుధవారం నిర్వహించిన వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం పరీక్షలకు అవసరమయ్యే స్టేషనరీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో పి.రమణ, స్పెషలాఫీసర్ గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మార్చి 20 నుంచి అనంతుని కల్యాణోత్సవాలు


సమావేశంలో నాయకులు, కమిటీ సభ్యులు

పద్మనాభం : పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో మార్చి 20 నుంచి 26 వరకు జరగనున్న అనంతుని కల్యాణోత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు కోరారు. కుంతీ మాధవ స్వామి ఆలయంలో బుధవారం కల్యాణోత్సవాలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవస్థానం, ఉత్సవ కమిటీ సంయుక్తంగా కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 20న పుట్ట బంగారం తేవడంతో అనంతుని కల్యాణోత్సవాలకు అంకురార్పన జరుగుతుందన్నారు. 21న అనంతుని కల్యాణం, 23న తెప్పోత్సవం, 24న అనంతుని రథోత్సవం జరుగుతుందన్నారు. 26న పుష్పాంజలితో అనంతుని కల్యాణోత్సవాలు ముగుస్తాయన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, గొర్రిపాటి పెద ఎర్రినాయుడు, సుంకర నారాయణరావు, భక్తబృందం సభ్యులు కంటుబోతు ఎర్నాయుడు, మొకర సన్నిబాబు, ఆలయ ప్రధాన అర్చకుడు పి.సీతారామాంజనేయ స్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి గాయత్రి మాత ఆలయ వార్షికోత్సవం


లింగన్నపేటలోని గాయత్రి మాత ఆలయం

పద్మనాభం: మండలంలోని లింగన్నపేటలో గాయత్రి మాత ఆలయ ఆశ్రమ 11వ వార్షికోత్సవం గురువారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. 8న గాయత్రి దేవి, లలితా దేవి, దుర్గాదేవి విగ్రహాలను పల్లకీలో ఊరేగించనున్నట్టు తెలిపారు. 9న కనకధారా స్తోత్ర పారాయణ చేయనున్నట్టు పేర్కొన్నారు. 10న దత్తాత్రేయ స్వామి, అనఘాదేవి కల్యాణం జరిపించనున్నట్లు తెలిపారు.

ప్రజారోగ్యానికి సీఎం జగన్ ప్రాధాన్యం


నగరంపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో నాయకులు, వైద్యులు

మధురవాడ: ప్రజల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జీవీఎంసీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు అన్నారు. మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి నగరంపాలెం వార్డు సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి, రోగులకు మందులు అందజేశారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ అవసరమైన అన్ని పరీక్షలు చేసి, మందులు అందిస్తున్నామన్నారు. అవసరమైన వారిని మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు సీఎం జగన్ పెంచారన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ కుడితి రామారావు, వైద్యులు దీపిక, సందీప్, వీవీ ప్రసాద్, వినీల, సీహెచ్‌వో సౌభాగ్యమణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం


మధురవాడలో క్రీడలు ప్రారంభిస్తున్న అతిథులు

మధురవాడ : జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెం రోడ్డులో గల శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో బుధవారం స్పోర్ట్స్ మీట్ ఘనంగా నిర్వహించారు. శ్రీచైతన్య విద్యా సంస్థల రీజినల్ ఇన్‌చార్జి అహ్మద్ ఆలీ హాజరై క్రీడా జ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులను చదువుతోపాటు ఆట, పాటల్లో కూడా తీర్చిదిద్దుతున్నట్టు చెప్పారు. సాయంత్రం విజేతలకు మెడల్స్, బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సందీప్, ఉత్తరాంధ్ర ఏజీఎం సురేష్, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జ్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

హైస్కూళ్ల ఆకస్మిక సందర్శన


గండిగుండం హైస్కూల్‌లో పరీక్ష పేపర్లు పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

ఆనందపురం : మండలంలోని పలు హైస్కూళ్లను డీఈవో ఎల్.చంద్రకళ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. గిడిజాల, గండిగుండం హైస్కూళ్లను పరిశీలించారు. పాఠశాలల్లోని మౌలిక సౌకర్యాలు, తరగతుల నిర్వహణ, ప్రభుత్వం అందించిన ట్యాబ్స్‌ను విద్యార్థులు వినియోగిస్తున్న తీరు అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఏ3 పరీక్ష పేపర్లను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పరిశీలించగా వెనుకబడి ఉన్నట్టు గుర్తించారు. ఈ మేరకు ఉపాధ్యాయులను వివరణ కోరి వారికి పలు సూచనలు చేశారు. అనంతరం పెందుర్తి హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

అవగాహనతో అగ్ని ప్రమాదాల నివారణ


అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

భీమునిపట్నం: అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై భీమిలి సమీపంలోని ది సెడార్ పాఠశాల వద్ద బుధవారం చిట్టివలస అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఇళ్ల వద్ద, బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్‌లలో ఎక్కువ శాతం ప్రమాదాలు సిలిండర్లు, స్టౌల వల్ల జరుగుతున్నాయన్నారు. కొన్ని సందర్భాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాదాలు జరగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు... ఎప్పుడైనా ప్రమాదం జరిగితే వెంటనే మంటలు ఆర్పే విధానం తెలుసుకోవాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జరిగితే ఎలా స్పందించాలన్న దానిపై ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, సిబ్బంది చక్రవర్తి, జగన్నాథం, రామకృష్ణ, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ఏపీడబ్ల్యూజేఎఫ్ ధన్యవాదాలు


జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు అందిస్తున్న నారాయణ తదితరులు

తగరపువలస : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ సభ్యత్వ నమోదు – 2024 కార్యక్రమం బుధవారం తగరపువలస ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. తగరపువలస, భీమిలి, ఆనందపురం ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు ఇందులో పాల్గొన్నారు. వారందరికీ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, జిల్లా అధ్యక్షుడు పోతుమహంతి నారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యుడు జి.శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పి.రంగదామారావు తదితరులు పాల్గొని గుర్తింపు కార్డులు, వాహనాల స్టిక్కర్లు అందించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్, హెల్త్‌కార్డులు అందించినట్టు తెలిపారు. ఇంకా మిగిలిన వారికి కూడా అందించేందుకు ఫెడరేషన్ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

వ్యక్తి ఆత్మహత్య


అప్పలరాజు (ఫైల్)

పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లిలో అప్పుల బాధ తాళలేక ఒక రైతు ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు ఏఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పులపా అప్పలరాజు (41) అప్పులు తీర్చలేనన్న భయంతో ఈ నెల 5న పురుగు మందు తీసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

'జనసేన నాయకులు మొరగడం ఆపాలి'


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పీఎంపాలెం : కనీస స్థాయి లేని జనసేన నాయకుడు పంచకర్ల సందీప్ ఇష్టారాజ్యంగా సీఎం, ఎమ్మెల్యేలను విమర్శించినంత మాత్రాన ఆవగింజ అంత నష్టం కూడా జరగదని 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు అన్నారు. పీఎంపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కనీసం వార్డు మెంబరు స్థాయి లేని సందీప్ కూడా విమర్శించడం తగదన్నారు. వార్డులన్నీ గతంలో కంటే ఎంతగా అభివృద్ధి చెందాయో నా వెనుక వస్తే చూపిస్తానన్నారు. జనసేన నాయకులు మొరగడం ఆపాలన్నారు. నాయకులపై అవాకులు చెవాకులు పేలడం సరికాదని గుడ్ల పోలిరెడ్డి అన్నారు. 6వ వార్డు నాయకుడు బొట్ట అప్పలరాజు మాట్లాడుతూ వార్డులో రెండు యూపీహెచ్‌సీలు నిర్మించామని, రూ.80 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇదంతా అభివృద్ధి కాక మరేమిటని ఆయన ప్రశ్నించారు. 7వ వార్డు నాయకుడు పోతిన శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో జరగని అభివృద్ధిని సీఎం జగన్ పాలనలో సాధించామన్నారు. 5వ వార్డు నాయకుడు పోతిన హనుమంతరావు మాట్లాడుతూ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. సమావేశంలో పోతిన ప్రసాదు, సియ్యాద్రి కనకరాజు, కుడితి రామారావు, పోతిన యల్లాజీ, పిళ్లా సూరిబాబు పాల్గొన్నారు.

మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసన


చిప్పాడ రామాలయం ముందు నిలిచిన మురుగునీరు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ రామాలయం ముందు ప్రధాన వీధిలో నిత్యం సాయంత్రం వేళ మురుగునీరు నిలిచిపోవడంతో చుట్టపక్కల వారు దుర్వాసన భరించలేకపోతున్నారు. పంచాయతీ పాలకవర్గం ఉదయం వేళ క్లియర్ చేసినా నిత్యం ఇదే కారణంగా దుర్గంధం బాధ తప్పడం లేదు. అసలే ఇరుకైన సందులతో కూడిన ఈ గ్రామంలో డ్రైనేజీలు కూడా చాలా చిన్నవిగా ఉన్నాయి. ఇటీవల కాలంలో నివాస గృహాలు బాగా పెరిగిపోవడంతో నీటి వాడకం పెరిగి వీధులను ముంచెత్తుతున్నాయి. ఈ మురుగు సమస్యను తప్పించుకునేందుకు డ్రైనేజీలను ఆధునీకీకరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇస్తున్నందున మళ్లీ సీసీ రోడ్లు నిర్మించేలోగానే డ్రైనేజీలను ఆధునీకీకరించాలని కోరుతున్నారు.

భవన నిర్మాణాలపై 1 శాతం సెస్ చెల్లించాలి

సీతంపేట : విశాఖ జిల్లాలోని అన్ని కన్‌స్ట్రక్షన్ యూనిట్లు, భవనాల నిర్మాణానికి వెచ్చించే వ్యయంలో 1 శాతం సెస్ రూపంలో ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.సునీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని భవన, ఇతర నిర్మాణాలు చేపట్టే యజమానులు తమ నిర్మాణాలను ఎస్టాబ్లిష్‌మెంట్ రూపంలో సమీప మీ సేవా, లేదా వార్డు సచివాలయంలో గాని, మీ సేవా పోర్టల్‌లో గాని నమోదు చేసుకోవ్వాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఎస్టాబ్లిష్‌మెంట్స్ ఫారం సీ రూపంలో రిటర్న్ కార్మిక శాఖ సంబంధిత అధికారికి అందజేయాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని ఉప కమిషనర్ స్పష్టం చేశారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు

మహారాణిపేట: సాధారణ ఎన్నికలకు ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు తప్పక కల్పించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం తూర్పు నియోజకవర్గానికి సంబంధించి ఏఈఆర్వోలు, వివిధ శాఖల అధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని బీఎల్వోలతో కలిసి తనిఖీ చేయాలని ఆదేశించారు. కేంద్రం వద్ద దివ్యాంగులకు ర్యాంపులు, ఓటర్లకు టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ బూత్ బయట ఆ కేంద్రం వివరాలు తప్పక నమోదు చేయాలని చెప్పారు. 10 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న ఇళ్లను పరిశీలించాలన్నారు. జనవరి 5 తరువాత అందిన ప్రతి ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, చేరికలు, తొలగింపులు జాగ్రత్తగా చేపట్టాలన్నారు.

సమస్యలుంటే తెలపండి..

ఓటరు జాబితాలు, పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా సమస్యలుంటే తక్షణం తెలియజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను జేసీ మయూర్ అశోక్ కోరారు. కలెక్టరేట్‌లో తూర్పు నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. తూర్పు పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అన్ని కేంద్రాల్లో ఎలక్షన్ కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఏఈఆర్వోలు, అధికారులు, సూపర్‌వైజర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.